# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 40 సంచిక 9

పేజీలు 44

మే 2021

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

దాశరథీ శతకము .................................... 4

శ్రీబాబూజీ ఉవాచ.................................... 5

అమ్మమాట.................................... 7

తత్త్వమసి .................................... 9

అగస్త్య హృదయం ........................ ..............11

గురుకృప ........................ ............................ ..........13

మంత్రోపదేశం ........... ..................... ..........................15

రామాయణంలో స్త్రీ పాత్రలు......................17

బాబూజీతో అనుభవాలు ..............................19

అగ్ని పరీక్ష ..................... ...................... ....................21

కాల జ్ఞానం ...... .. ......................... ............................25

సాగర సంగమం ................ ............................ 27

కైవల్యోపనిషత్ ... ............................................30

న గురోరధికం ....................... ..........................32

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు............................34

శ్రీ బాబూజీతో అనుభవాలు .......................35

శ్రీ గురు రవిదాస్ .......... .....................................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ............................ ....................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

**10) కనకవిశాలచేల భవకానన శాతకుఠారధార స**
**జ్జనపరిపాలశీల! దివిజస్తుత సద్గుణ కాండ! సం**
**జనిత పరాక్రమ! క్రమ విశారద! శారద కందకుంద చం**
**దన ఘనసార! సారయశ దాశరథీ కరుణాపయోనిధీ !**

భావం - బంగారు మయమైన వస్త్రములు కలవాడవు, సంసారమను అడవికి గొడ్డలి మొనవంటివాడవు, సజ్జనులను పరిపాలించెడివాడవు, దేవతలచే బొగడబడినవాడవు, మంచి గుణములు గలవాడవు, బాణ విద్యలో పండితుడవు, శరత్కాలపు మేఘము, మొల్లలు, గంధము పచ్చకర్పూరము వంటి నిర్మలమైన కీర్తి కలవాడవు! దాశరథీ కరుణాపయోనిధీ!




*యుద్ధభూమిలో చెప్పబడిన మూడు ఉపదేశాలు ఏవి?
*విచారణ అంటే ఏమిటి?
*గురువు నోటి నుండి వచ్చిన పలుకులే అక్షర సత్యమవుతాయని నిదర్శనం ఏమిటి?
*శ్రీబాబు అనుగ్రహ భాషణం మధ్యలో మంచినీళ్ళు ఎందుకు త్రాగుతారు?
*గురువుని ఏమని అడగాలి?
*పూర్ణత్వం అంటే ఏమిటి?
*త్రైలోక్య రాజ్యము ఎవరి ఔన్నత్యానికి 16వ వంతుకి కూడా సరిపోదు?
*మహాత్ములు దేనికోసం జీవిస్తారు?
*కావేరీ నది ఒడ్డున ఇసుక తీస్తుంటే ఎందుకు రక్తం చిమ్మింది?

***సమాధానాలు లోపలి పేజీలలో...........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

5-11-1980

ఈరోజు సుమారు రాత్రి 9గం॥లకు శ్రీ బాబూజీ దర్శనం ఇచ్చినపుడు, ఉదయం విజయవాడ రేడియో స్టేషన్ నుండి సూక్తిముక్తావళిలో శ్రీ బాబు ప్రసంగం గూర్చి చర్చ వచ్చింది. అందరూ ప్రసంగం బాగుంది అన్నారు. శ్రీ ఉషశ్రీ ప్రశ్న వేయకపోతే ఇంకా బాగుండేది అన్నారు శ్రీ బాబూజీ.



శ్రీరామకృష్ణ పరమహంసని ఒక పండితుడు ఒకసారి "స్వామీ! ధ్యేయం, ధ్యాత, ధ్యానం అంటే ఏమిటి?" అని ప్రశ్నించాడు.

వాటికి రామకృష్ణ పరమహంస సమాధానం చెపుతూ "ఓ పండితోత్తమా! మీ పండితుల తలవెంట్రుకలలోని చిక్కులు నాకు తెలియదు. నాకు తెలిసినదల్లా నీలోని ఆత్మవస్తువు, మా అమ్మ జగజ్జనని మాత్రమే" అన్నారు.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ "శ్రీ శంకర భగవత్పాదులవారు అన్నట్లు దర్శించేది, దర్శించేవాడు, దర్శింపబడేది అంతా పూర్ణమైనపుడు, ఇంక గోచరించేది, మిగిలేది ఏముంది? పూర్ణత్వము పొందినపుడు ఇంక ఏం గోచరిస్తుంది. దానికి రూపనామక్రియలు ఉంటాయా? ధ్యేయం అంటే లక్ష్యార్థం, ధ్యాత అంటే లక్ష్యార్థమును సాధించేవాడు, ధ్యానం అంటే లక్ష్యార్థమును సాధించే క్రియ. లక్ష్యార్థములో ఇవన్నీ లయమైనపుడు ఇంక గోచరించేది ఏమిటి? అదే పూర్ణత్వము.

పరమహంస స్వరూపులైన మహాత్ములు ఎప్పుడూ అందరి శ్రేయస్సునూ కోరతారు. సర్వేజనాః సుఖినోభవంతు అనేదే వారి లక్ష్యం. చేప జలధిలోనే ఉన్నా, ఆ జలాన్ని శుద్ధిచేసినట్లు మహాత్ములు సమస్త

నరజలధిలో జీవరాశుల మధ్య నివసిస్తూ వారి హృదయాలలో ఉన్న మలినాన్ని తొలగించి, వారికి దివ్యత్వాన్ని ప్రసాదిస్తారు" అన్నారు శ్రీ బాబూజీ.

"వేదములు బ్రహ్మముఖస్థగా వచ్చినప్పటికీ బ్రహ్మదేవుని ప్రకాశింపజేసే పరమాత్మయే వేదములను బోధించినది, కాని బ్రహ్మదేవుడు కాదు. రేడియో పాడుతుంది. అయితే ఆ పాడే శక్తి రేడియోదా? కాదు దానిని పాడించే శక్తి బ్యాటరీది. ఆ బ్యాటరీయే లేకపోతే, రేడియో పాడలేదు. అదే ఆత్మశక్తి.

ఇంతకీ అసలు సంగతి మరిచాము. మరి తలచిక్కు బేరాలు పెట్టే పండితులచేత పలికించేదీ అదే శక్తికదా!" అన్నారు శ్రీ బాబూజీ.

## పాఠకులకు విజ్ఞప్తి

సమర్థ సద్గురు మాసపత్రికలో ప్రచురితమయ్యే వ్యాసాలను రోజుకు ఒకటి చొప్పున సులువుగా చదువుకొనుటకు టెలిగ్రాం ఛానల్ ప్రారంభించబడినది. ఈ ఛానల్‌లో చేరుటకు మీ చందా నంబరును టెలిగ్రాం యాప్ ద్వారా 83338 08310 కు పంపవలెను.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**మే 2021**

6 గురు - శ్రీ గురుదశమి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

16 ఆది - శ్రీశంకర జయంతి - శ్రీ సద్గురుపాదపూజ

26 బుధ - శ్రీ గురుపూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ

**జూన్ 2021**

4 శుక్ర - శ్రీగురుదశమి, శ్రీహనుమజ్జయంతి, శ్రీసద్గురుపాదపూజ

24 గురు - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## మనస్సుకు విశ్రాంతినిచ్చేది ఏది?

మానవుడు ఉదయం నిద్ర లేచినది మొదలు, రాత్రి నిద్రపోయే అంత వరకూ పనులు చేసి, చేసి అలసిపోయి వుంటాడేమో, శరీరం ఎప్పుడు విశ్రాంతి తీసుకుందామా అని ఎదురు చూస్తూ వుంటుంది. ఆ అలసటనంతా నిద్రలో మరచిపోతాడు.



'నాకు నిద్ర పట్టడం లేదండీ' అని మనం డాక్టరు దగ్గరకు వెడితే ఆయన 'ఏమీ ఫరవాలేదులే' అని అనడు. నిద్ర పట్టక పోవడం వలన శరీరానికి, మనస్సుకి కూడా మంచిది కాదు. అందుకని డాక్టర్లు మనకి నిద్రకి సంబంధించిన కొన్ని జాగ్రత్తలు, పథ్యాలు చెప్పి, చివరికి ఏదో ఒక నిద్ర బిళ్ళ ఇస్తారు.

ఈ విశ్రాంతి అనేది ఎందుకు ఇచ్చాడు భగవంతుడు? ఈ స్థూల దేహానికి మాత్రమే విశ్రాంతి అవసరమా? మొట్ట మొదట విశ్రాంతి కావలసినది సూక్ష్మ దేహానికే అంటే మనస్సుకే. మనస్సు విశ్రాంతిగా వున్నప్పుడు నిద్ర హాయిగా పడుతుంది. మనస్సు అల్లకల్లోలంగా వున్నప్పుడు నిద్ర పట్టదు. ఒకవేళ పట్టినా, ఆ నిద్రలో కూడా మనస్సు పని చేస్తూనే వుండి, కలలో మనను బాధిస్తుంది.

మరి మనస్సుకి విశ్రాంతి ఎలా వస్తుంది? మనస్సుకి విశ్రాంతిని ఇచ్చేది విచారణ. ఆ విచారణ ఎలా కలుగుతుంది? దేని గురించి విచారణ చేస్తే మనస్సుకి విశ్రాంతి వస్తుంది? మహాత్ములు, సత్యగురువులు చెప్పే బోధలని నిరంతరం శ్రవణం చేసి, వాటిని మననం చేయడమే విచారణ. ఇది మన మనస్సుకి విశ్రాంతినిస్తుంది. అలాకాకుండా లోకుల గురించి, ప్రపంచ విషయాల గురించి విచారణ చేస్తే మనకి మిగిలేది అశాంతే. మహాత్ములు తమ దివ్య బోధ ద్వారా మనకు అనేక సూచనలను ఇస్తారు. ఆ బోధలను, వారందించిన సూచనలను నిరంతర విచారణలో (తత్వంతో) మనస్సుని మధనం చేయాలి. గురు లక్ష్యార్థముతో మనస్సును

నిరంతరం రాపిడి పెట్టాలి. అలాగని స్పీడుగా 'ఓం నమఃశివాయ' అనో, 'రామ రామ' అనో నామం అనడం కాదు. నామానికీ నామానికీ మధ్యలో మనస్సు ఇతర సంకల్పాలు చేయకూడదు. మనం చేస్తున్న నామంలో మన మనస్సు లయించిపోవాలి.

త్యాగరాజ స్వామి, రామదాసు, కబీర్‌దాసు వంటి మహాత్ములు ప్రపంచ ఆకర్షణలకు విముఖులై నిరంతరం భగవన్నామ రసాస్వాదనలో నిమగ్నమైపోయారు. కనుకనే వారు బ్రహ్మానంద సామ్రాజ్యానికి, భక్తి సామ్రాజ్యానికి అధిపతులయ్యారు. త్యాగరాజ స్వామికి శరభోజి మహారాజు అనేకానేక కానుకలు పంపి, తన కొలువుకి రమ్మనమని కోరితే, త్యాగయ్య 'నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా? నిజముగ దెల్పుము మనసా!' అని తన మనస్సుని గద్దించి ప్రశ్నించాడు. అలా ప్రశ్నించేసరికి ఆ మనస్సు గజగజలాడిపోయి కూలబడిపోయింది!

ఆయన ఎలా తమ మనస్సును శాసించగలిగాడు? కేవలం రామ నామ ధ్యానం ఆయనకా శక్తినిచ్చింది. కేవలం భగవద్విషయం యందు శ్రద్ధ ఒక్కటే చాలదు; మనం లక్ష్యార్థం సాధించాలంటే ఇంద్రియ నిగ్రహం చాలా అవసరమని గీతాచార్యుడు శెలవిచ్చివున్నాడు. భావన ద్వారా భవమును దాటవచ్చును. భగవద్భావన ద్వారా పుట్టుక లేకుండా చేసుకోవచ్చు.

రాత్రి గాఢ నిద్రలో పొందే ప్రశాంతతను మనం జాగ్రదావస్థలో వ్యవహారం చేసేటప్పుడు కూడా పొందవచ్చు. ఈ వ్యవహారం అంతా జరిగేటట్లు చేసేవాడిని గుర్తిస్తూ, స్మరిస్తూ వుంటే అనుక్షణం ప్రశాంతతే. మనలోనే వుండి మననీ ఈ సమస్త సృష్టినీ నడిపిస్తున్న ఆ అనంత శక్తిని, లేక చైతన్యాన్ని గుర్తించాలి. పచ్చని చెట్టుకి పచ్చదనం, మామిడి పండుకి తియ్యదనం, పచ్చిమామిడికాయకు పులుపు, వగరుతనం ఎవరిచ్చారు? అది గుర్తించండి. ఇదే విచారణ. అంటే ఇటువంటి విచారణ ద్వారా రాముని దర్శింపజేసి అనుభవింపజేస్తారు గురువులు. మాంస మయమైన ఈ శరీరాన్ని మంత్రమయం చేసి, మనని శ్రీగురు పాదుకలు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి రక్షించుగాక! సుఖీభవ!!

(గత సంచిక తరువాయి)

# తత్త్వమసి

- సుషుమ్నా ప్రసాద

కానీ శ్వేతకేతువు విద్యతో వినయ సంపన్నుడు కాకుండా, తానే సర్వసమర్థుడననే అహంకారపూరితుడై దురభిమానంతో వక్రమార్గంలో పయనిస్తున్నాడని గ్రహించి, పుత్రుని సత్యమార్గాన్వేషిని చేయాలని సంకల్పించాడు అరుణి. అందుచేత పుత్రుని పిలిచి, 'నీవు గురుకులం నుండి తిరిగి వచ్చిన తరువాత నీవే సర్వజ్ఞుడవైనట్లు నీకు అవగాహనకాని వేదసారము, శాస్త్రజ్ఞానము ఏవీ లేవన్నట్లు భావిస్తున్నావు. కానీ ఏ బ్రహ్మోపదేశం చేత అశ్రుతం శ్రుతమవుతుందో, అవిజ్ఞాతం విజ్ఞాతమవుతుందో (తెలియనిది తెలియబడుతుందో) అంటే దేనిని నీవు తెలుసుకుంటే సమస్తము తెలియబడినట్లు అవుతుందో, అటువంటి పరబ్రహ్మోపదేశాన్ని నీవు గురువును అడిగావా? గురువు నుండి నీవు ఆ తత్త్వాన్ని తెలుసుకున్నావా?' అని ఉద్దాలకుడు తన పుత్రుడు శ్వేతకేతుని అడిగాడు.

తండ్రి వేసిన ప్రశ్నకు శ్వేతకేతు నిరుత్తరుడయ్యాడు. తాను తెలుసుకొనవలసినది ఇంకా చాలా వున్నదని తన తండ్రివేసిన ప్రశ్న వలన గ్రహించాడు. అంతవరకూ తాను నేర్చినదే సంపూర్ణమని, తాను మహాపండితుడనని, సర్వజ్ఞుడనని గర్వంతో విర్రవీగాడు. ఇప్పుడు జ్ఞానోదయమై తాను నేర్చుకోవలసినది ఇంకా చాలా వున్నదని గ్రహించి, తన గురువుగారు తనకు ఆ విద్య ప్రబోధించలేదని చాలా వినయంగా చెప్పాడు. దేన్ని తెలుసుకుంటే సమస్తము తెలిసినట్లవుతుందో అట్టి విద్య తనకు ప్రబోధించి, తరింపజేయుమని తండ్రిని వేడుకున్నాడు. కుమారునిలో వచ్చిన మార్పును గ్రహించి ఉద్దాలకుడు ప్రబోధించడం ప్రారంభించాడు.

'కుమారా! మనం మట్టితో వివిధ రకాలైన పరికరాలు తయారు చేస్తున్నాము. అందులో అనేక రకాలైన పాత్రలు, బొమ్మలు తయారు చేస్తున్నాం. మట్టియే ఆధారంగా కుండలు, కడవలు, మూకుళ్ళుగా చేస్తున్నాం. అలాగే రాజు, రాణి, భవంతి, కూరగాయలు, పండ్లు , అనేక రకాలైన జంతువులు, పక్షుల బొమ్మలు తయారు చేస్తున్నాం. వీటికి రూప

నామాలు వైవిధ్యంతో భిన్నంగా వున్నాయి. కానీ, వాటన్నిటికీ ఆధారమైనది మట్టి మాత్రం ఒక్కటే. అంటే కార్యం కారణం కంటే వేరుకాదని శాస్త్ర సిద్ధాంతం. ఈ వస్తువులలో, బొమ్మలలో దేన్ని పగుల గొట్టినా వచ్చేది మట్టి మాత్రమే.

అలాగే అనేక రూపాలు, ఆకారాలతో కూడిన ఈ దృశ్యమాన ప్రపంచాన్ని అనేక పేర్లతో పిలుస్తున్నాము. కాని ఈ కల్పిత ప్రపంచం మూల పదార్థం కంటే భిన్నం కాదు. కాబట్టి నాయనా! నామరూపాత్మకమైన జగత్తు మూల పదార్థమైన సత్పదార్థమునకు భిన్నం కాదు. ఆ మూల పదార్థమే సత్యము. దానికి మార్పు వుండదు. ఈ నామ రూపాత్మకమైన జగత్తంతా దాని వికారమే అని సదా గుర్తించు. జగత్తు యావత్తు తద్వికారమే. దానికి స్వయం ప్రతిపత్తి లేదని గ్రహించు.

అలాగే ఈ విషయాన్ని వివరంగా చెప్పడానికి మరొక దృష్టాంతము చెబుతాను. మనం వెండి, బంగారములతో అనేక వైవిధ్యమైన నగలను, ఆభరణాలను తయారు చేస్తున్నాము. కర్ణాభరణాలు, ముక్కెర, కిరీటాలు, గాజులు, భుజకీర్తులు, రకరకాల హారాలు, పళ్ళాలు, చెంబులు ఇంకా అనేక విధములైన వస్తువులను తయారు చేస్తున్నాము. కానీ వీటన్నిటికీ మూల కారణమేమిటి? బంగారము లేదా వెండి. వీటన్నిటినీ కరిగిస్తే రూప రహితమైన బంగారము, లేదా వెండిగా మారుతాయి.

మూలాధారమైన వస్తువు ఒక్కటే. దానికి మార్పు లేదు. ఆత్మనిత్య సత్యమై, పరిణామ రహితమై ప్రకాశిస్తుంది. కాని వాటితో సృష్టించబడిన వస్తువులకు వైవిధ్యమైన రూపములు, నామములు వున్నాయి. అవి పరిణామం చెందేవి. అలాగే ఈ విశ్వానికంతటికీ మూలాధారము పరమాత్మ. జగత్తునందు వివిధ రూపాలను ప్రకాశింప జేసేది ఆ పరమాత్మయే. ఎలాగైతే మట్టి ఒక్కటే సత్యము, బంగారము ఒక్కటే సత్యము.

-సశేషం

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీప్రసాద్ U.S.A

**రామ రామ మహాబాహో! శృణుగుహ్యం సనాతనమ్।**

**ఏన సర్వాన్ అరీన్ వత్స సమరే విజయిష్యసి ॥**

మహాబాహుడవైన శ్రీరామా! సనాతనమూ, గుహ్యామూ అయి శత్రునాశనము చేసి నీకు విజయమును కూర్చగల స్తోత్రమును వివరిస్తాను వినుము.

తన శిష్యుడైన శ్రీరాముని విజయపథంలో నడిపించడానికి ఆదిత్యహృదయాన్ని బోధించబోతున్న అగస్త్యులవారి ఆర్తిని ఈ శ్లోకం తెలుపుతోంది. రామా రామా అంటూ రెండుసార్లు ఆప్యాయంగా పిలవడమే కాక, 'వత్సా!' అని సంబోధించడమే ఆ ఆర్తికి నిదర్శనము. వత్స అన్న పదమును లేగదూడ విషయంలోనే కాక, గురువు ఎంతో ప్రేమతో తన శిష్యుని సంబోధించే సందర్భంలో వాడడం కనిపిస్తుంది. లేగదూడ వలే చెంగు చెంగున పరుగులెత్తే మనస్సును నియంత్రించగల గురువే అలా ప్రేమగా పిలువగలరు.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।**

**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥**

అంటూ ఉపనిషత్తుల సారమును గోవుగానూ, జగద్గురువులైన శ్రీకృష్ణుని గోపాలకునిగానూ పోలుస్తూ, అర్జునుడిని వత్సగా పోల్చారు. జగద్గురువుల అపార ప్రేమకు పాత్రుడైన శిష్యునే కాక, భగవద్గీత ద్వారా జ్ఞానక్షీరములను అందించడానికి కారణమైన దూడగా కూడా అర్జునుడిని ఆ సందర్భంలో భావించాలి. అదే వాత్సల్యము ఇక్కడ అగస్త్యుల పలుకులలో కనిపిస్తుంది.

ఇంకా ఆదిత్యహృదయం యొక్క పేరును ప్రస్తావించకుండానే చాలా సనాతనమైనదీ మరియూ గుహ్యమైనదనీ తెలిపారు. గుహ్యమంటే సాధారణంగా రహస్యమైనదని అర్థం. అంత రహస్యమైనదయితే యుద్ధ భూమిలో బహిరంగంగా ఎలా అందించారన్నది ఆలోచించవలసిన విషయం. అందుకే గుహ్యము అన్న పదానికి 'చాలా లోతైనది' గా అర్థమును గ్రహించాలి. కానీ అందరికీ ఉపయోగకరమైనది కాబట్టే యుద్ధ భూమిలో చెప్పబడింది.

ముందు వివరించబడినట్లుగా భగవద్గీత భీష్మాచార్యులు అంపశయ్యపై వుండి శలవిచ్చిన విష్ణుసహస్రనామం కూడా

యుద్ధభూమిలో చెప్పబడినవే. ఇవన్నీ అంతఃశత్రువులతో పోరాటం సలిపే సాధకులకు ఆచార్యరూపంలో గురువులందించిన ఉపదేశములే. గుహ్యము అన్న ప్రస్తావన బాహ్యపరమైన వాచ్యార్థములే కాక, నిగూఢమైన అంతరార్థములు దాగివున్నాయనీ, అంతర్ముఖమైన విచారణ చేసినప్పుడు మాత్రమే అవి అందుతాయనీ తెలియజేస్తోంది.

ఈ విషయానికి మరో ప్రమాణం మనకు **'రహస్యనామ స్తోత్రం'** గా చెప్పబడిన లలితాసహస్రనామములలో కనిపిస్తుంది. **'అంతర్ముఖ సమారాధ్య బహిర్ముఖ సుదుర్లభా'** అంటూ జగన్మాత తత్వం అర్థం చేసుకోవడం బహిర్ముఖంగా దుర్లభమనీ, కేవలం అంతర్ముఖమైనప్పుడే సాధ్యమనీ, అందుకే అమ్మవారి నామములను 'రహస్య'మైనవిగా భావించాలనీ చెప్పబడింది.

అదే విధంగా మండలాతర్వర్తియై వున్న ఆదిత్యుని తత్వము మరియు హృదయాంతర్వర్తియై వున్న గురు తత్వమూ గుహ్యమైనవనీ, లోతైన విచారణ ద్వారా మాత్రమే గుర్తింపబడతాయనీ అర్థం చేసుకోవాలి.

మరొక విశేషమేమంటే లలితాసహస్రనామములను హయగ్రీవ అవతారంలో వున్న నారాయణుడు అగస్త్యులవారికి ఉపదేశిస్తే, ఆదిత్య హృదయమును అగస్త్యులు రామావతారంలో వున్న నారాయణుడికి ఉపదేశిస్తారు. దీనిని బట్టి కేవలం నిమిత్త కారణముల వల్ల జరిగినట్లు కనబడే ఈ ఉపదేశముల వెనుక మానవాళికి పనికివచ్చే పరమ ప్రయోజనము దాగి వున్నదని స్పష్టమవుతుంది. సర్వాన్ అరీన్ అంటూ అనేకులైన శత్రువుల యొక్క ప్రస్తావన రాముని ఎదురుగా వున్న ఒక్క రావణుడినే కాక అరిషడ్వర్గములైన శత్రు కూటమిని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను సూచిస్తోంది.

అగస్త్యులు సమరే విజయిష్యసి అని ఆశీర్వదించిన తక్షణమే ఆయనపై సంపూర్ణ విశ్వాసము వుంచిన శ్రీరాముని విజయం తథ్యమైనది. గురువులు భవిష్యత్తులో జరగబోయే విషయం చెప్పడం కాదనీ, వారి నోటి నుండి వచ్చిన పలుకులే అక్షర సత్యమవుతాయనీ గుర్తించడానికి ఇది ఒక నిదర్శనము. గురువాక్యము యొక్క శక్తి అలాంటిది మరి!

- సశేషం

# గురుకృప

- పెనుమాక నాగేశ్వరరావు

సమర్థ సద్గురు శ్రీ శ్రీ శ్రీ హనుమత్ కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి దివ్య చరణాలకు ప్రణమిల్లుతూ, పూజ్యశ్రీ యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పాదపద్మములకు సాష్టాంగ నమస్కారములు ఆచరిస్తూ వారి అనుగ్రహంతో నా మనసులో మెదిలే భావాలను నాకు చేతనయిన భాషలో వ్యక్తపరచే ఈ చిన్ని ప్రయత్నానికి మీ అందరి ఆశీస్సులు కోరుతూ.......

1967 ప్రాంతాల్లో గుంటూరు బ్రాడీపేట లోని శ్రీ పాండు గారి ఇంటిలో మొట్టమొదటిసారి శ్రీ బాబూజీ దర్శన భాగ్యం పొందిన అదృష్టవంతుడ్ని నేను. అప్పుడు నా వయసు పది, పదకొండు సంవత్సరాలు వుంటాయి. ఆనాడు నేను ఆయన పాదం పట్టుకున్నాను. ఆ క్షణం నుంచీ ఆయన నా చేయి పట్టుకుని నడిపిస్తూ వున్నారు.

గుండుగొలను గ్రామంలో దసరా నవరాత్రులలో కాలం తెలియకుండా ఎలా గడిచిపోయేదో అనుభవించిన అదృష్టవంతుడ్ని నేను. ఆ నాటి ఆ హాయి కల కాదోయి నిజమోయీ అన్నది అక్షర సత్యం.
ఓ చక్కని ప్రయోజనాన్ని సాధించడం కోసం పై నుంచి కిందికి దిగడాన్ని అవతరించటం అంటారని (అవ (కిందికి) తారం (ప్రయాణిస్తూ దిగడం) ఏదో పుస్తకం లో చదివాను. అలా అవతారం దాల్చిన బాబూజీ, మన కళ్ళముందే మాతాజీగా తమ అవతారం మార్చుకున్నారు. మార్చుకుని మనందరి పైనా ఆశీస్సులు కురిపిస్తున్నారు. మా పుణ్యం కొద్దీ పురాణ పురుషుడవైతిరి కొన్నేళ్ళు, అమ్మగా వచ్చి తుడిచిరి మళ్ళీ మా కన్నీళ్లు అని బాబూజీ ఇచ్చిన ప్రేరణతో ఓ గేయంలో వ్రాసుకుని ఆనందం పొందాను.

చదువుని నిర్లక్ష్యం చేస్తున్నావు జాగ్రత్త అని మందలించినా, ఇంటర్వ్యూ లో అడగబోయే ప్రశ్నలకి మిత్రుల చేత ముందు రోజే నాకు సమాధానాలు చెప్పించి ఉద్యోగం ఇప్పించినా, ఫలానా వ్యక్తినే పెండ్లి చేసుకోమని సూచించినా ఆ సద్గురు దేవులకే చెల్లింది. అలాంటి భాగ్యం చాలామందిలాగే నాకూ దక్కింది.

**అరయన్ శంతను పుత్రుపై విదురుపై నక్రూరుపై కుబ్జపై నరుపై ద్రౌపదిపై కుచేలుపయిన్ నందవ్రజశ్రేణి పైపరగం గల్గు భావత్కృపా రసము నాపై** కూడా రానిచ్చారు శ్రీ బాబూజీ, కొనసాగిస్తూ వర్షింప చేస్తున్నారు శ్రీ మాతాజీ.

1989 సంవత్సరంలో బృందావనం పొదరిల్లుగా వున్న రోజుల్లో గుంటూరులో వారంవారం సత్సంగాలు జరుగుతుండేవి. అప్పుడు మొదటిసారిగా భక్తుల నోటి వెంట "అమ్మ చెప్పారు", "మాతాజీ అన్నారు"...............అని విన్నాను కానీ మాతాజీ ఎవరో తెలియలేదు. అలాగని ఎవర్నీ అడగనూ లేదు. అడగటానికి బిడియం. తర్వాత ఆశ్రమానికి వచ్చినప్పుడు తెలిసింది మాతాజీ ఎవరో. సహజంగానే సందేహం కలిగింది. మనసులో చాలా ప్రశ్నలు. సందేహంతోనే అందరితోపాటు అమ్మ పాదాలకు నమస్కారం చేసుకున్నాను. మనసులో మెదిలే ప్రశ్నల పరంపరకు తట్టుకోలేక  నా సందేహం తీర్చమని బాబూజీనే వేడుకున్నాను .

ఇలాంటి సందేహాలకి సమాధానాలు చెప్పినా, సందేశాలు ఇచ్చినా సాధారణంగా స్వప్నాల్లోనే కదా. అలాగే నాకూ ఓ కల వచ్చింది. గుంటూరు ఓంకార క్షేత్రం లో బాబూజీ మహరాజ్ సమక్షంలో సత్సంగం జరిగి నమస్కారాల సన్నివేశం వచ్చింది. నేను కాళ్ళు ముడుచుకుని బాబూజీకి నమస్కరించుకున్నాను. "నాకు ఇలా చేస్తే చేశావు గానీ మీ మాతాజీకి ఇలా చేయకు" అన్నారు నాతో బాబూజీ. (కాళ్ళు జాపి సాష్టాంగ నమస్కారం చేసుకోమని ఆజ్ఞాపించారు) అంతే నా సందేహం పటాపంచలయి పోయింది. మాతాజీ ప్రాధాన్యత అలా స్పష్టంగా తెలియజేశారు శ్రీ బాబూజీ. ఒకసారి మా అక్క (ఆర్టీసీ లక్ష్మి) ఆశ్రమానికి వచ్చి మాతాజీతో ఇంటర్వ్యూ అయ్యాక నేరుగా గుంటూరులో మా ఇంటికి వచ్చింది. నేను అప్పుడే బ్యాంక్ నుంచి ఇంటికి వచ్చాను. రేపు మన ఇద్దరం ఆశ్రమానికి వెళ్ళాలిరా అన్నది మా అక్క. అర్థం కానట్లు చూశాను ఆమె వంక. మాతాజీ నీ విషయంలో చాలా ఆగ్రహం వెలిబుచ్చారు. నువ్వు ఎన్నిసార్లు హెచ్చరించినా సిగరెట్లు తాగటం మానుకోవటం లేదుట. రేపు వెళ్ళి కనబడాలి అని చెప్పింది.

నాకు ఎక్కడ లేని భయం. అయినా ఆమెతో కలసి మాతాజీ దర్శనం కోసం వచ్చాను. నన్ను చూస్తూనే అమ్మ ఆప్యాయంగా నవ్వారు. సగం భయం తగ్గింది. ఆమె కళ్ళల్లో కనిపించిన కరుణ మరువలేనిది, మరపురానిది. నమస్కారం చేసుకుని పాదాల దగ్గర కూర్చున్నాను.

- సశేషం

# మంత్రోపదేశం

- ఎన్. కుట్టీ

అది భరద్వాజ ఆశ్రమం. ఆ ఆశ్రమానికి అధిపతి భరద్వాజస్వామి. ఆ ఆశ్రమం చాలా అందమైనది. ఆహ్లాదకరమైనది. చూపరులకు ఆ చెట్లు, ఆ పర్ణశాలలు, ఆ భక్తుల వినయవిధేయతలు, వారి భక్తి చూసినవారికి ఆ ఆశ్రమంలో వుండిపోవాలనిపిస్తుంది. భరద్వాజస్వామి మంచితనం, వారిలో వుండే ప్రేమతత్వం, మానవుల మీద కురిపించే ప్రేమ, వారి ముఖంలోని కళ వారిని చూడగానే జనులను వారు ఉద్ధరించగలరనే భావన కలుగుతుంది.

ఒక రోజు ఒక యువకుడు ఆ ఆశ్రమానికి వచ్చాడు. ఆ యువకుడు వచ్చిన రోజున స్వామి ఆశ్రమంలో లేరు. సత్సంగ కార్యక్రమాల నిమిత్తం పొరుగూరు వెళ్ళారు. ఆ యువకుడు ఆ ఆశ్రమంలో అడుగు పెట్టగానే అక్కడి వాతావరణం చూసి మురిసిపోయి, అక్కడి ముఖ్య శిష్యులను కలుసుకుని, అక్కడి వివరాలు అడిగి తెలుసుకుని, అక్కడే చెట్టు క్రింద కాసేపు సేదతీరి, గురువుగారు రాగానే మరల వస్తానని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

రెండు రోజుల తరువాత గురువుగారు సత్సంగాల నుండి తిరిగి వచ్చారని కబురు తెలుసుకుని ఆ యువకుడు మరల వచ్చి భరద్వాజస్వామిని కలుసుకున్నాడు. స్వామి సద్గురువు. ఆయనకు జరగబోయేవి, వారి కష్టసుఖాలు అన్నీ కూడా వ్యక్తిని చూడగానే తెలుస్తాయి. స్వామివారు ఆ యువకుడిని చూడగానే అతని జీవితంలో విశేషాలు అన్నీ తెలిసిపోయాయి. ఆయన అతన్ని ప్రశ్నిస్తూ 'నాయనా! నీ పేరేమిటి? ఏ ఊరు మీది? ఏమి చేస్తూ వుంటావు? నీకు ఈ ఆశ్రమం నచ్చిందా?' అంటూ వివరాలు అడిగారు.

అతను సమాధానం చెబుతూ 'స్వామీ! నా పేరు రంగనాధుడు. నేను బ్రాహ్మణుడను. బ్రహ్మణ్యకార్యాలు చేసి జీవితం గడుపుతున్నాను. నాకు భార్య పిల్లలు వున్నారు. నా తల్లిదండ్రులు మరణించి చాలా కాలమైనది. నాకు ఇక్కడ ఆశ్రమం వాతావరణం, భక్తులు అన్నీ కూడా చాలా బాగా నచ్చాయి. నేను జీవితాంతం ఇక్కడే వుండిపోతాను' అన్నాడు.

భరద్వాజస్వామి అతనితో 'నాయనా! నిన్ను చూస్తుంటే మీ

ఇంట్లో మీ శ్రీమతితో పోట్లాడి, భార్యాపిల్లలను వదలి ఇక్కడికి వచ్చినట్లుగా అనిపిస్తోంది. నేను చెప్పినమాట విని, నువ్వు తిరిగి మీ ఇంటికి వెళ్ళి హాయిగా నీ భార్యా పిల్లలతో గడుపు. నీకు అంతా బాగానే వుంటుంది. నువ్వు ఇక్కడికి వచ్చేస్తే వారిని ఎవరు పోషిస్తారు? కాబట్టి నువ్వు కొంతకాలం వారితో గడిపిరా. అప్పుడు నిన్ను నా శిష్యుడి క్రింద చేర్చుకుంటాను' అన్నారు.

తిరిగి ఆ యువకుడు తన ఇంట్లో తనకున్న బాధలన్నీ గురువుగారితో ఏకరువు పెట్టి, నేను ఇంటికి వెళ్ళను మీ దగ్గరే వుండిపోతాను అన్నాడు. కాని గురువుగారు ఆ యువకుడితో 'ఇప్పుడే కాదు, ఇంకా సమయం వుంది. కొంతకాలమైన తరువాత రా' అని అనగానే ఇహ చేసేది లేక తన ఇంటికి తిరిగి వెళ్ళిపోయాడు.

గురువుగారు చెప్పిన ప్రకారం కొంతకాలం పోయిన తరువాత మళ్ళీ భరద్వాజ ఆశ్రమానికి వచ్చాడు. గురువుగారు అతనితో 'నాయనా! ఆశ్రమం బాగుందని, నచ్చిందని అన్నావు. కానీ నీవు ఆశ్రమంలో వుండాలంటే ఆశ్రమ పద్ధతులు చాలా కఠినంగా వుంటాయి. నీవు వుండలేవు. ప్రతిరోజూ తెల్లవారుజామున 4గంటలకే స్నానం చేసి, అన్ని కార్యక్రమాలకు తప్పక హాజరు కావాలి. ఒక్కరోజు కూడా బద్ధకించకూడదు. ఆశ్రమంలో ఏది పెడితే అదే భుజించాలి. మనకు కావలసినవి పెట్టరు. రాత్రిపూట త్వరగా పడుకోవాలి. వీలైనంత వరకు భగవన్నామ స్మరణలో గడపాలి. ఆ తరువాత నీ ఇష్టం బాగా ఆలోచించుకో. అంతేకానీ ఇక్కడ ప్రవేశించాక నీ ఇష్టం వచ్చినట్లు వుంటానంటే కుదరదు' అని హెచ్చరిక చేశారు. రంగనాధుడు 'స్వామీ! నేను వుండగలను. నాకు ఆశ్రమంలో వుండటానికి అనుమతిని ఇవ్వండి' అన్నాడు. స్వామి అతనికి అనుమతినిచ్చారు.

- సశేషం

# రామాయణంలో స్త్రీ పాత్రలు

-సుషుమ్నా ప్రసాద

(గత సంచిక తరువాయి)

## సీత

శ్రీరామునకు ముల్లోకములపై రాజ్యాధికారము శ్రేష్ఠమా, లేక సీతను పొందడము శ్రేష్ఠమా అని ఆలోచిస్తే, త్రైలోక్య రాజ్యము సీతయొక్క ఔన్నత్యమునకు 16వంతు కూడా సరిపోదు.

అరణ్యకాండలో అత్రిమహర్షి ఆశ్రమానికి సీతారామలక్ష్మణులు వెళ్ళినప్పుడు అనసూయ కోరగా సీత అత్యంత మనోజ్ఞమైన మధురవాణితో తన వివాహం, ధనుర్భంగం గురించి సిగ్గుపడుతూ చెబుతుంది. అనసూయ సీతను చూసి ముగ్ధురాలై, భవిష్యత్తులో ఆమె ఎదుర్కొనవలసిన దుర్భర పరిస్థితులను వూహించి, ముందుగానే ఆమెకు వాడని పూలను, మాయని వస్త్రాలను ఇస్తుంది. అవి నిరంతరం స్వచ్ఛంగా, తాజాగా వుంటాయి. అందుచేతనే సీత సంవత్సరకాలంపాటు స్నానపానాదులను స్వీకరించకపోయినా, వస్త్రము మార్చకపోయినా, పరిమళ భరితంగా, స్వచ్ఛంగా వున్నాయి.

ఆమె పాతివ్రత్య మహిమతో తన పుత్ర సమానమైన హనుమంతుని తోకకు లంకాధిపతి నిప్పు అంటించినా మండిపోకుండా మలయమారుతం వీచినట్లుగా చల్లగా వుంచిన మహిమాన్విత మైథిలి. సీతామాతను హనుమ తన భుజస్కంధాలపై వుంచి రామచంద్రుని సన్నిధికి చేరుస్తానంటే ఆమె అంగీకరించదు. ఎటువంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొన్న ఆమె సహనము నిరుపమానము. పిరికి రావణుడు తనను కపటంగా చాటుగా తెచ్చినా, ఆ కపటాన్ని తృణీకరించి, రామచంద్రుడు స్వయంగా వచ్చి తన సత్త్వ పరాక్రమములను ప్రదర్శించి, దశకంఠుని వీరోచితంగా జయించి, తనను తీసుకుని వెళ్ళడమే సీతమ్మతల్లి అభిమతము. అంతటి సహనమూర్తి. ధీరోదాత్త వనిత.

అంతటి ధీరోదాత్త వనిత, పతివ్రతా శిరోమణి, మహాసాధ్వి, సహనశీలి అయిన సీతను రామచంద్రుడు రావణ వధ అనంతరం ఏడాదికాలం లంకలో వున్నందుకుగాను, ఆమె పవిత్రతను నిరూపించుకుంటేనే స్వీకరిస్తానని చెప్పాడు. ఆమె శ్రీరామునికి తన పవిత్రత, సచ్ఛీలత మీద శంక వున్నప్పుడు హనుమంతుని ద్వారా కబురు పంపవచ్చు కదా! అని ప్రశ్నించింది. ఆమె మూర్తీభవించిన పతివ్రత కాబట్టి

ఎంతో ధీరత్వంతో అగ్నిప్రవేశం చేసి తన పవిత్రతను నిరూపించుకున్నది.

ఆమె అగ్ని ప్రవేశం చేయగానే అగ్ని తాపం నశించి, జ్వాలలో నుండి చందన లేపనం ఉద్భవించి శీతలపరిచింది. అగ్ని దేవత సీతను తన ఒడిలోకి తీసుకుని, ఆమె పాతివ్రత్యం నియమ నిష్ఠలు కలదని నిరూపించింది. ఆ విధంగా అగ్ని పునీతయైన అయోనిజను స్వీకరించి శ్రీరామచంద్రుడు తన సహచరి పవిత్రతను ముల్లోకాలకు నిరూపించాడు.

అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషేకానంతరం కూడా ఆ మహారాజ్ఞి కష్టాల కడలిలోనే కాలం గడపవలసి వచ్చింది. ప్రజాభిప్రాయానికి పెద్దపీట వేసిన పట్టాభిరాముడు నిండుచూలాలుగా వున్న నీరజాక్షి సీతమ్మను వనాలకు పంపించడం మైథిలికి మానసిక వ్యథనే మిగిల్చింది. కాని ఆమె మానసికంగా దుఃఖాన్ని భరిస్తూ, వాల్మీకి ముని వాటికలో తపస్వినిలాగా కాలం గడిపింది. తన కర్తవ్యం నెరవేరే వరకు ఆ కరుణామయి రాముని వారసులైన లవ, కుశలు పతిదేవునికి అప్పగించటం తన పరమావధిగా భావించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత వాల్మీకి మహర్షికి అప్పగించింది. మహా తపస్వినిగా, పరమ విరాగినిగా, తన హృదయంలో నిలుపుకున్న తన అంతర్యామియైన రామచంద్రునితోనే శేష జీవితాన్ని గడిపింది.

శ్రీరామచంద్రుడు తన బిడ్డల శౌర్య పరాక్రమాలు తెలుసుకున్న తరువాత, తన ధ్యేయం నెరవేరిందని, తన కర్తవ్యం ముగిసిందని శ్రీరామచంద్రుని సభామందిరంలోకి ప్రవేశిస్తుంది. కానీ, రాముని దయను కోరడానికి మాత్రం కాదు. తన వలన తన భర్తకెలాంటి కళంకం రాకూడదనే ఆ కరుణామయి దృఢ సంకల్పం. తన కర్తవ్యం ముగియగానే సీతమ్మ భూమాతను నిర్భయంగా తనను కుమార్తెగా, ఆమె బాహుబంధంలో శాశ్వతమైన శాంతిని ప్రసాదించమని ప్రాధేయపడి, తన ఇహలోక జీవితానికి స్వస్తి చెప్పి, భూదేవి ఒడిలో పవ్వళించింది.

'నేను మనసా, వాచా, కర్మణా రామునే ఆరాధిస్తున్నాను. అదే నిజమైతే ఉష్ణమును, స్నేహమును ప్రసాదించి తన హృదయంలో నాకు స్థానం కల్పించు గాక!' అని సీతా స్వాధి ఏ భూమాత ఒడిలో నుంచి ఉద్భవించిందో, ఆమె ఒడిలోనే లీనమైపోయింది.

# శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారితో

(గత సంచిక తరువాయి) **అనుభవాలు** -వి. లక్ష్మీ నరసమాంబ

## మనుమడు ఎలా లభించాడు?

మా రెండవ అబ్బాయికి, అంటే ఇక్కడ హైదరాబాద్‌లో నాతోపాటు వుండేవానికి పెళ్ళై 10 ఏళ్ళు అయినా కూడా పిల్లలు కలుగలేదు. ఈ విషయం ఒకసారి మాతాజీగారికి మనవి చేశాను. 'ఆ అమ్మాయిని (కోడలిని) ఒకసారి కలవమనండి' అని సూచించారు. ఆ అమ్మాయి రాలేదు. ఎవరి నమ్మకాలు వారివి! చేసేది ఏమీ లేక ఎవరో భక్తుల సూచన మేరకు నేనే నంబూరు ఆశ్రమంలో వుండి దీక్షచేసే ఉద్దేశంతో అక్కడకు వెళ్ళాను. కానీ, మూడు రోజులు గడిచినా అమ్మ దర్శనం కాలేదు. అంటే నా పని కాదన్నమాట! ఆ విషయం గ్రహించి వెనకకు తిరిగి వచ్చాను.

అయితే, 'నాకు వృద్ధాప్యంలో బాసటగా మీరు వున్నట్లు, మీకు కూడా ఒక ఆధారం కావాలి కదమ్మా!' అన్న నా అభ్యర్థనను మా కోడలు అంగీకరించింది. వారిద్దరూ సంప్రదించుకుని, ఎవరైనా ఒక పిల్లవాడిని దత్తత తీసుకునేందుకు తమ అంగీకారం తెలిపారు. అదీ ఒక అనాథ ఆశ్రమం నుండి! దానితో, బాబు దత్తత భారం నా మీద వేసుకుని, ఔరంగబాద్‌లోని ఒక శిశు సంరక్షణాలయం వారితో మాట్లాడి, వారి వద్ద నుండి ఒక అప్లికేషన్ ఫారమ్ తెప్పించాను. నా కొడుకు, కోడలు దానిని ఎంతకీ నింపక తాత్సారం చేస్తూంటే, నేనే వివరాలన్నీ వ్రాసి, తెలిసిన డాక్టర్ ద్వారా సర్టిఫికెట్ తీసుకుని, సంతకాలకై వారికిచ్చాను. అప్పటికి వారికి దానియందు ఆసక్తి కలిగి, తదుపరి కార్యక్రమమంతా వారే చూసుకున్నారు. ఇలాగ అర్జీ పెట్టుకున్న ఏడాదిన్నరకే, 'మీకు తగిన బాబు, నాలుగున్నర నెలల పిల్లవాడు వున్నాడు వచ్చి చూసుకోండి' అని వారి నుండి కబురు వచ్చింది. కోడలు ఆ పిల్లవాడిని చేతిలోకి తీసుకోగానే వాడు సమ్మోహనంగా నవ్వాడు. ఆమె వెంటనే ఆ పిల్లవాడిని దత్తత తీసుకోవడానికి తన అంగీకారం తెలిపింది. ఆ దత్తతకు ఆమె తల్లిదండ్రులు కూడా పరిపూర్ణంగా అంగీకరించారు.

ఆ విధంగా ఒక శుభముహూర్తాన బంగారంలాంటి ఆ బాబు మావారే తిరిగి వచ్చారా! అన్నట్లుగా మా ఇంటికి వచ్చాడు. ఇంటిని సంతోషంతో నింపాడు. నాకు వృద్ధాప్యంలో ఒంటరితనానికి పరిష్కారం ఆ విధంగా బాబుగారు చూపించారు.

ఇంత చక్కని బాబు, రంగు, కను ముక్కు తీరు అంతా నా కొడుకు కోడలిలాగా ఆరోగ్యంగా నవ్వుతూ కేరింతలు కొడుతూ మా ఇంటికి వచ్చాడు. ఇదంతా బాబుగారి ప్రసాదం! ఆయనే ఈ విధంగా వారి జీవితంలోని లోటును అడగకుండానే తీర్చారు అని నేను అనుకున్నాను.

ఆ బాబుకి 'నీవి' అంటే 'పునాది' అని వారు పేరు పెట్టుకున్నారు. నా కొడుకు దృష్టిలో ఆ పిల్లవాడు వాళ్ళ నాన్నగారే! నా దృష్టిలో బాబుగారే! అంటే నీవే! వాడు ఇంటికి వచ్చిన తరువాత పౌర్ణమినాడు ఆ పిల్లవాడిని బాబుగారి పాదాలకు అర్పించి, అందరికీ ప్రసాదం పంచి, నా కృతజ్ఞతలను తెలియపరచుకున్నాను.

## బాబుగారు - మనుమడి ఆరోగ్యం

నా మనుమడు నీవీని బాబుగారి ప్రసాదంలాగా భావించాను. ఇంట్లో పెద్దవాళ్ళు ఎవరూ లేరు. కోడలు ఆఫీసుకు వెడుతుంది. పైగా విదేశీ ప్రయాణాలు చాలా హెచ్చుగా వుంటాయి. ఆ అమ్మాయి తల్లిదండ్రులు సికింద్రాబాద్ వైపు వున్నారు. అందువలన ఆ పిల్లవాడి బాధ్యతను సహజంగానే నేను స్వీకరించాను. పనివాళ్ళ సహాయంతో వాడిని పెంచాలి అనుకున్నాను. కానీ, కోడలి ఉద్దేశం మరోలా వుంది అని నాకు తెలియలేదు. ఆమె తనకు తెలిసిన విధంలో, అంటే వారి పద్ధతిలో పనివాళ్ళ సహాయంతో పిల్లవాడిని పెంచాలని అనుకున్నది. అలా అని ఆమె తల్లిదండ్రుల సలహాను పూర్తిగా తీసుకోలేదు. నేను చేసేదానితోటీ అంగీకరించలేదు.

- సశేషం


అగ్ని పరీక్ష
మధుప
ఈ బంగారు పాత్రను తీసుకొని నాకు డబ్బులు ఇస్తారా?
1


ముందు ఇది ఎంత స్వచ్ఛమైన బంగారమో పరీక్షిద్దాం.
2


మీ బంగారం అగ్ని పరీక్షకు నిలచింది. ఇవిగోండి మీ డబ్బులు!
3
ఈమధ్య డబ్బులకి చాలా ఇబ్బందిగా ఉంటోంది మావా!
మొన్న నాకూ ఇలాగే డబ్బులు అవసరమైతే నా దగ్గర ఉన్న బంగారు పాత్రను అమ్మేశాను.
4


ఈ బంగారు బొమ్మను తీసుకొని నాకు తగిన డబ్బులు ఇవ్వండి.
తప్పకుండా! ముందు ఇది ఎంత స్వచ్ఛమైన బంగారమో పరీక్షిద్దాం.


నేను అర్జెంటుగా వెళ్ళాలి. మళ్ళీ కలుస్తా!
అమ్మ దొంగ వెధవా! అయితే ఇది చిలకలపూడి బంగారం అన్నమాట!
7


చూశారా! నిజమైన భక్తుడు ఎంతటి విషమ పరీక్ష ఎదురైనా తట్టుకొని అగ్నిలో కాల్చిన బంగారంలాగా ఇంకా విశేషంగా ప్రకాశిస్తాడు. అదే కపట భక్తుడు పైకి ఎంతటి మహా భక్తుడిలాగా వేషాలు వేసినా చిన్న పరీక్ష ఎదురవగానే పలాయనం చిత్తగిస్తాడు.
8

# కాలజ్ఞానం

-పాలూరి కాళీప్రసాద్

గురుదేవులు శ్రీ బాబూజీ మహరాజ్‌వారి ప్రార్థనా శ్లోకాలలో ముఖ్యమైన మూడింటిలో మనకు ఒక అంశం ప్రముఖంగా కనిపిస్తుంది. ఒక శ్లోకంలో 'కాలజ్ఞాన విదగ్రణిం' అని, మరొకదానిలో 'కాలవేదినం' అని, మూడవదానిలో 'కాలజ్ఞతాది మహితోజ్వల శక్తిమంతం' అని వుంటుంది. ఇంతకీ ఈ కాలజ్ఞానం అంటే ఏమిటో, అది కలిగి వుండటం వలన సాధక బాధకాలేమిటో కొంచెం విచారణ చేద్దాం.

మామూలుగా మనకి మన గతంలో మన జీవితంలోనో, మన కళ్ళయెదుటనో జరిగిన విషయాలు తెలుస్తాయి. అలాగే వర్తమానంలో మనం ప్రత్యక్షంగా చూస్తున్న, అనుభవిస్తున్న విషయాలు తెలుస్తాయి. అంతేగానీ, భవిష్యత్తులో మనకుగానీ, వేరే వ్యక్తులకుగానీ ఏమి జరుగుతుందో మనకు తెలియదు. నిజానికి మానవుడికి ఇలా భవిష్యత్తు తెలియకపోవడం ఒక పెద్ద వరమనే చెప్పాలి. ఉదాహరణకు ఒక పిల్లవాడికి రేపు పరీక్షలో మంచి మార్కులు వస్తాయని ముందుగానే తెలిసిపోయిందనుకోండి, ఎలాగో మంచి మార్కులు వస్తాయికదా అని ఈ రోజు చదవడం మానివేస్తాడు. అలాగే పరీక్షలలో తప్పుతాడని తెలిసినా, ఎలాగో తప్పేదానికి ఇహ వృథా శ్రమ ఎందుకని చదవడం మానేస్తాడు. అలాగే మనం జీవితంలో చేసే ప్రతి పనిలోనూ దానివలన మనకు భవిష్యత్తులో ఉపయోగం వుంటుందనో, మంచి జరుగుతుందనో ఆశతోనే ఆయా పనులు చేస్తూ వుంటాం. అదే నీ శ్రమంతా వృథా అవుతుందని ముందుగానే తెలిస్తే ఏ వ్యక్తీ ఆ పని చేయడు.

ఈ బ్రతుకు శాశ్వతం కాదని మనందరికీ తెలుసు. మన దగ్గరివారు ఎవరైనా చనిపోగానే 'ఎంతైనా మానవ జీవితం అశాశ్వతం కదా' అని శ్మశాన వైరాగ్యం తెచ్చిపెట్టుకుంటాం. కానీ, మనం మన జీవితానికి వచ్చేసరికి చేసే ప్రతిపనీ, వేసే ప్రతి ప్రణాళికా మన జీవితం ఇంకా సుదీర్ఘ కాలంపాటు నడుస్తుందనే అంచనాతోనే ముడిపడి వుంటుంది. అంతెందుకు, రేపు ప్రొద్దున్న దూర ప్రయాణం చేయాలంటే ఇవాళ రాత్రంతా మనకు సరిగా నిద్ర పట్టదు. అలాంటిది రేపు తెల్లారి మనం లేవకుండా శాశ్వతంగా ఈ దేహాన్ని విడిచిపెట్టి పోతామని

ముందే తెలిస్తే అసలు మనం నిద్రపోగలమా? మరి ప్రతిరోజూ నిశ్చింతగా నిద్రపోగలుగుతున్నామంటే దానికి కారణం రేపు తప్పకుండా లేస్తామనే ఆశ.

మన పిల్లలు ఎంత చెడుగా ప్రవర్తించినా మాటిమాటికీ వారిని క్షమించి మళ్ళీసారి మంచిగా నడచుకోమని హితబోధ చేస్తూ వుంటాం. ఎందుకు? ఎప్పటికైనా వారు మారతారనే ఆశ. అలాగే అవతలివారు అడిగినా అడగకపోయినా వారు పాటిస్తారనే ఆశతో సలహాలు ఇచ్చేస్తూ వుంటాం. అదే మనకు భవిష్యత్తు తెలిసి వీరు ఖచ్చితంగా మారరు, లేదా మన సలహాలు పాటించరు అని తెలిసిందనుకోండి, అప్పుడు మనం ఎంతమాత్రం ఆసక్తి చూపిస్తాం? 'పోతేపోనీ' అనుకుంటాం కదా! అలాగే కేవలం భవిష్యత్తే కాదు, వర్తమానంలో ఎదుటివారి మనస్సులో కలిగే భావాలు మనకు తెలిసినా మనం వారితో మామూలుగా ప్రవర్తించ గలమా?

అదే కాలజ్ఞాన విదగ్రణి అయిన శ్రీగురుదేవులకు ఎదుటివారి భూత, భవిష్యత్, వర్తమానాలు స్పష్టంగా తెలియటమే కాకుండా, వారి వారి మనస్సులు కూడా తెరచిన పుస్తకంలా విస్పష్టంగా కనిపిస్తూ వుంటాయి. అయినా వారి వాక్కులోగాని, ప్రవర్తనలోగాని ఎటువంటి మార్పు లేకుండా కేవలం అది తమ ధర్మంగా భావిస్తూ, నిష్కామంగా ఎదుటివారిపైన తమ నిర్హేతుకమైన కరుణావర్షాన్ని కురిపింపజేస్తూనే వుంటారు. తమ బోధనలను పెడచెవిని పెడతారని ముందే తెలిసినా, తమ సూచనలను పాటించరని తెలిసినా, వీరు గతంలో ఎంతో దుష్ప్రవర్తన కలిగినవారని తెలిసినా, వీడి బుద్ధి కుక్క తోకలాగా మళ్ళీ మళ్ళీ వంకర తిరుగుతుంటుందని తెలిసినా, శ్రీగురుదేవుల కర్తవ్యనిష్ఠలో కానీ, వారి కరుణా ప్రసారంలో కానీ ఎటువంటి మార్పూ వుండదు. ఎందుకంటే సర్వమానవాళిని, సకలజీవకోటిని ఉద్ధరించడమే వారి అవతార లక్ష్యం, ఆశయం. అందుకే '**మాములు మానవులు ఆశల కోసం జీవిస్తారు, మహాత్ములు ఆశయాల కోసం జీవిస్తారు**' అని పెద్దలంటారు.

-సశేషం

# సాగర సంగమం

- జగన్నాథ ప్రసాద్

నీరు పల్లమెరుగు నిజము దేవుడెరుగు - సాధరణంగా మనలో చాలా మంది అనుకుంటూ వుంటాం, 'నేను ఫలానా రోజున, లేదా ఫలానా సంవత్సరంలో శ్రీబాబును కలిశాను, మొదటిసారిగా దర్శించాను' అని. కాని, శిష్యుడికి సద్గురువు గురించి తెలియకపోయినా, ఇంకా చెప్పాలంటే శిష్యుడు పుట్టక ముందు నుంచీ గురువు యొక్క మనో నేత్రంలో ముద్రింపబడే వుంటాడు. మన జన్మజన్మల కర్మల ఫలితాలను అనుసరించి, తగిన సమయం వచ్చినప్పుడు, వారే శిష్యుడిని దగ్గరకు లాక్కుంటారు. 'నేను ఫలానా తేదీ నుండి వస్తున్నాను' అన్నది ప్రాపంచిక దృష్టిలో మాత్రమే. అయస్కాంతం యొక్క ఉత్తర ధృవం గురువు, శిష్యులు అందరూ దక్షిణ ధృవం. శారీరకంగాగానీ, మానసికంగా గానీ శిష్యుడు గురువును చేరవలసినదే.

గురువు సాగరం వంటివారు. శిష్యులు విభిన్నమైన నదుల వంటివారు. సాగరం పల్లంలో వుంటుంది. నదులు ఎత్తులో వుంటాయి. ఇది ప్రకృతి. 'నాకు సముద్రంలో కలవడం ఇష్టం లేదని ఏ నది అయినా అనుకోవచ్చుగానీ, అది జరిగే పనియేనా? ఇష్టమున్నా, లేకపోయినా నది సాగరంలో కలవలసినదే. అది దాని సహజ గుణం. సముద్రంలో కలిసిపోయాక, నదులు తమ ఉనికిని కోల్పోతాయి. ఇది కృష్ణానీరు, ఇది గోదావరి నీరు అని విడదీయడానికి వీలు లేదు. అలాగే శిష్యులు గురువును కలిశాక, తమ ఉనికిని వ్యక్తిగతానికి ప్రాధాన్యతను వదలుకొని, 'గురువుగారి శిష్యులు' అని అనిపించుకోవలసినదే.

ప్రతి అన్నం మెతుకుపైనా తినేవాడి పేరు వ్రాయబడి వుంటుంది! ఇది ఎవరూ కాదనరాని సత్యం. కొంత మంది సేవ, ద్రవ్యము, వస్తువులు తమకు తెలియకుండానే, తమ ప్రమేయం లేకుండానే విచిత్రంగా సద్వినియోగ పడతాయి! దీనికి ఒక చక్కటి ఉదాహరణ .....

నేను అప్పట్లో హిల్‌కాలనీలో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీరు ఆఫీసులో పని చేస్తున్నాను. 23-9-2003 రాత్రి 1-15ని॥లకు నేనూ, మా అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీ వి.ఎల్. ఎన్. శాస్త్రిగారు వారి

స్కూటర్‌పై ఆఫీసు నుండి బయలుదేరాము. నన్ను నా క్వార్టర్‌లో దింపి, వారు వారి క్వార్టర్‌కు వెడతానన్నారు. ఆఫీసు ప్రహరీగోడ దాటగానే మెయిన్ రోడ్డు. స్కూటర్ ఆ రోడ్డుమీదకు రాగానే, శాస్త్రిగారికి అక్కడ నోట్లు కనిపించాయి. వారు స్కూటర్ ఆపారు. నేను దిగి ఆ నోట్లు తీశాను. అవి కొత్త వందరూపాయి నోట్లు మొత్తం పది! తీసి, జేబులో పెట్టుకుని, నా క్వార్టర్ దగ్గరకు వెళ్ళాము. ఆ డబ్బు గురించి చర్చించాము. అది ఆ నెలలో ఆఖరి వారం. పైగా క్రొత్త నోట్లు. కాబట్టి ఆఫీసులో ఎవరివీ అయి వుండవు. దారిన పోతున్నవారెవరివో అక్కడ పడిపోయి వుండాలి. పోలీసు స్టేషన్‌లో అప్పగించే ఆలోచన విరమించాము. ఎందుకంటే, అలా చేస్తే ఏమవుతుందో అందరికీ తెలిసినదే. 'అయిదు రోజులు చూద్దాము. ఆఫీసులో ఎవరైనా పడవేసుకుని వుంటే తెలిసికొని వారికి తిరిగి ఇచ్చేద్దాము. లేదంటే అప్పుడే ఆలోచించవచ్చు' అని అనుకున్నాము.

వారం తరువాత ఇద్దరమూ శాస్త్రిగారి క్వార్టర్‌లో కూర్చున్నాము. ఆ డబ్బును ఎలా వినియోగించాలో అని నా మనస్సులో ఒక ఆలోచన వచ్చింది. కానీ, నా ఆలోచన గురించి ముందుగానే నేను చెబితే, అది వారికి ఇష్టం లేకపోయినా కూడా నేను చెప్పాను కాబట్టి 'సరే' అనవచ్చు. అందుకే వారు నన్ను చెప్పమన్నాగానీ, నేను చెప్పను, ముందు మీరే చెప్పండి. ఆ తరువాత నేను చెబుతాను అన్నాను.

'చెరి సగం పంచుకుందాం!' అని అన్నారా? కానే కాదు! వారి మనస్సులో కూడా శ్రీబాబూజీ దూరారు. వారు మాట్లాడుతూ 'సార్! మీ ఆశ్రమంలో త్వరలో దసరా ఉత్సవాలు జరుగుతాయి కదా! ఆ సందర్భంగా అన్నదానానికి ఇచ్చేద్దామా?' అన్నారు. ఎంత విచిత్రం! అప్పుడు నేను 'నా ఆలోచన కూడా అదే. కానీ, నేను ముందే చెబితే, మీకు ఇష్టం లేకపోయినా సరే అనవచ్చు అందుకని నేను ముందుగా చెప్పలేదు' అన్నాను. ఇద్దరం కూడా చాలా సంతోషపడ్డాము. 5-10-2003న ఆ సొమ్ము 1000 రూ॥లను వారి పేరు మీదుగా అన్నదానానికి అందజేయడం జరిగింది.

ఆ డబ్బు పోగొట్టుకున్న వ్యక్తి ఎంత అదృష్టవంతుడు! తన డబ్బు ఒక ఆశ్రమంలో అన్నదానానికి వినియోగ పడింది అని అతనికి తెలుసా? తెలియక జరిగినా, అది అతని దానమే! పుణ్యాత్ముడు! ఆ విధంగా

శ్రీబాబూజీ ఆ వ్యక్తితో బంధం ఏర్పరచుకున్నారు కదా! వారు శ్రీబాబూజీని చూసి వుండకపోవచ్చు. కానీ, ఆ ప్రతి నోటు మీద 'శ్రీ కాళీ గార్డెన్స్‌లో అన్నదానానికి' అని కనిపించని అక్షరాలను ఆ బ్రహ్మ వ్రాశాడు! బ్రహ్మ లిఖితం వమ్ముపోతుందా? అది జరిగి తీరవలసినదే. ఆ వ్యక్తి ఒక నది. తనకు తెలియకుండానే తన ప్రమేయం లేకుండానే శిష్యకోటిలో ఒకడయ్యాడు! ధన్యజీవి! ఎవరిని, ఎప్పుడు, ఎలా దరికిజేర్చుకోవాలో, ఎలా ఉద్ధరించాలో తెలిసిన సర్వజ్ఞుడు సమర్థ సద్గురువు శ్రీబాబు!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**మే 2021**

6 గురు - శ్రీ గురుదశమి - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

16 ఆది - శ్రీ శంకరజయంతి - ఉ. 11గం సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

26 బుధ - శ్రీగురుపూర్ణిమ - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

**జూన్ 2021**

4 శుక్ర - శ్రీగురుదశమి, శ్రీ హనుమజ్జయంతి -సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

24 గురు - జ్యేష్ఠ పూర్ణిమ - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

శ్రీమాతాజీ మధ్యాహ్న సత్సంగ కార్యక్రమం శ్రీ సదాశివ బ్రహ్మేంద్రుల వారి కీర్తన 'ఖేలతి బ్రహ్మేండే భగవాన్' ఆలపిస్తూ ప్రారంభించారు. ఇందులో రెండు చరణాలు పాడారు.

ఖేలతి బ్రహ్మేండే భగవాన్

ఖేలతి పిండాండే

1. హంసః సోహం హంసః సోహం

హంసః సోహం సోహమేవేతి

2. పరమాత్మాహం పరిపూర్ణోహం

బ్రహ్మైవాహ మహం బ్రహ్మేతి

తత్త్వమేవ త్వమేవతత్ అన్న వాక్యాన్ని ఈ కీర్తన ద్వారా ఇంకా విపులీకరించారు శ్రీ మాతాజీ. శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు సిద్ధ పురుషులు. పరమ వైరాగ్య దృష్టి కలిగివున్నవారు. శరీర దృష్టి అసలు లేనివారు. వారు కావేరీ నది ఒడ్డున కూర్చుని ధ్యానం చేస్తూ సమాధిలో వుంటే నది పొంగడం, ఇసుక మేట వేయడం, వారి శరీరం పూర్తిగా ఇసుకతో కప్పబడిపోవడం జరుగుతుంది. కొంతమంది మనుషులు ఇసుక కావల్సి వచ్చి నది ఒడ్డున త్రవ్వుతూ వుంటే గడ్డపారకు ఏదో గట్టిగా తగిలింది. ఇసుక తీస్తూ వుంటే రక్తం పైకి చిమ్మింది. వెంటనే వారు జాగ్రత్తగా ఇసుకను తప్పించి చూస్తే అందులో నుండి స్వామివారు పైకి లేచి నడుస్తూ రక్తం ప్రవహిస్తున్నా ఈ విధంగా పాడుకుంటూ వెళ్ళిపోయారు. మనకి కూడా అంతటి తీవ్రమైన వైరాగ్య దృష్టి, వివేక దృష్టి దృఢంగా వుంటే ఆ స్థితికి వెళ్ళగలమేమో. ఎంత క్లోరోఫారమ్ ఇచ్చినా శరీరం, మనస్సు ఆ స్థితికి వెళ్ళలేవు.

భగవంతుడు బ్రహ్మేండంతో అంటే సృష్టితో, పిండాండంతో అంటే జీవులందరితో ఆడుకుంటున్నాడు. ఈ శరీరాలనే యంత్రాలన్నిటినీ ఆ భగవంతుడు ఆడిస్తున్నాడు. మానవుడు ఆడుతున్నాడు. గాలి పీల్చడం, వదలివేయడం అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలు మన ప్రమేయం లేకుండానే జరిగిపోతున్నాయి. కనురెప్పలు మూసి తెరచుకుంటున్నాయి. నిమిషానికి

ఎన్ని సార్లు ఇవన్నీ జరుగుతున్నాయి అని లెక్కపెట్టబోతే మనవల్ల కాదు. అయితే ఈ శ్వాసమీద దృష్టి నిలిపి ధ్యానం చేయమంటారు మహాత్ములు. శ్వాస అనే ప్రక్రియ జీవుడిలో ప్రాణం వున్నంతవరకూ నిరంతరం జరుగుతూ వుండేది. ఆ విధంగా జపం, ధ్యానం చేస్తే అది నేను అని సూచిస్తుంది సోహం మంత్రం. హంసస్సోహం ఆ పరబ్రహ్మను నేను అనేది సూచన మంత్రం. ఇది కేవలం ఏకాగ్ర చిత్తంతో ధ్యానం చేస్తే నేను ఉన్నాను, ఉన్నది నేనే ఆ పరబ్రహ్మ వస్తువుని నేను అని గుర్తిస్తే ఆనందం మన సొత్తు అవుతుంది. అయితే మనస్సు యొక్క చాంచల్యం వల్ల గుర్తించలేక పోతున్నాము. ప్రయత్నం చేసి, ఇక్కడికి వచ్చి కూర్చుని ఉపనిషత్ జ్ఞానం పొందుతున్నామంటే మహాత్ములు మనకు ఇచ్చిన అవకాశం వల్ల. తద్వారా మనకి కూడా ఆ సద్వస్తువును గురించి అనుభూతి కొంచెంగానైనా అనుభవానికి వస్తోంది. ఈ సూచన మంత్రం ద్వారా ఈ జీవితం నడిపిస్తున్నాడు, ఆడిస్తున్నాడు.

ఆ పరమాత్మ పరిపూర్ణమైనవాడు. బ్రహ్మఏవ అహం. నాశనము లేని బ్రహ్మయే నేను అయి వున్నాను. ఉన్నది నేనే అని దృఢంగా తెలుసుకుంటాము. మనంతట మనకే అనుభవానికి వస్తుంది ఆ పరమాత్మ స్వరూపం. అహం అంటే నాశనము లేనిది. త్వమేవాహం తత్త్వమేవ త్వమేవతత్ అని బ్రహ్మదేవుడు అశ్వలాయన మహర్షికి నిశ్చయంగా చెప్పారు. చిన్నప్పటి నుండి పెద్దలు మనకీ విషయాన్ని గురించి చెబుతూ అలవాటు చేస్తే ఆ విషయం మనకు అనుభవానికి రావడం లేదనే ఆవేదన కలిగి, ఆ అనుభూతి కోసం ప్రయత్నం చేస్తాం. సద్గురువు పాదాలు పట్టి ఏమి సేకరించుకుంటున్నామని విచారణ చేయాలి. జీవితాలు అశాశ్వతం. దైవత్వం శాశ్వతం. మన పెద్దలు సాధన ఎలా చేశారో ఒకసారి అవలోకనం చేస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి. వారు బ్రాహ్మీ ముహూర్తంలో లేచి, అలసత్వానికి తావివ్వకుండా ఎలా ధ్యానం చేశారో తెలుస్తుంది. మదాలస అన్న ఆవిడ పిల్లలను ఉయ్యాలలో ఊపుతూ సిద్ధోస్మి, బుద్ధోస్మి, నిరంజనోస్మి అని పాడుతూ వుండేదిట. మహాత్ములను ఆశ్రయించి, వారి సన్నిధిలో వుంటే మనకి కూడా వారు తత్త్వమేవ, త్వమేవతత్ అనే ముద్ర వేస్తారు. బ్రహ్మైవాహం - చచ్చేవాడిని కాను అని దృఢంగా తెలుస్తుంది.

- సశేషం

# న గురోరధికం

- వేలమూరి రవికుమార్

1995లో నేను కాన్పూర్‌లో వుండేవాడిని. ప్రతిరోజూ సాయంత్రం కంప్యూటర్ కోర్స్‌కు మిత్రులతో కలసి వెడుతుండేవాడిని. 'జగన్మాత కుంకుమ నుదుటన ధరించి, అక్షతలు శిరస్సున ధరించి, గురుస్మరణ చేసి ఇంటి నుండి బయటకు వెడితే మీకు ఆ జగన్మాత రక్షణ, శ్రీగురు సంరక్షణ స్వంతమై వుంటుంది' అని శ్రీబాబూజీ పలుమార్లు సభలో ప్రబోధించారు. ఇది నా విషయంలో నిజమైనది.

ప్రతిరోజులాగే సెప్టెంబర్ 1వ తారీఖున నా మిత్రుడు అనిల్ కుమార్ స్కూటర్ మీద కంప్యూటర్ కోర్స్‌కి వెళ్ళబోతూ బాబుగారి చిత్రపటం ముందు నిల్చుని కుంకుమాక్షతలు ధరించి, సద్గురు అష్టోతరం చదివి హెల్మెట్ చేతిలో తీసుకుని బయలుదేరాను. కొంత దూరం వెళ్ళాక 'వెంటనే హెల్మెట్ ధరించు' అని పలుమార్లు శ్రీబాబూజీ మహరాజ్‌వారు ఆజ్ఞాపించినట్లుగా నా మనస్సుకు అనిపించింది. వెంటనే ధరించాను. సుమారు 50కి.మీ దూరం వెళ్ళాక ఆగివున్న జీపు చూశాను. ఆ జీపు వద్దకు నా మిత్రుడు చేరేటప్పడికి ఆ జీపు డ్రైవర్ హఠాత్తుగా కుడివైపుకు తిప్పాడు. మా స్కూటర్ జీపుకి, రోడ్ డివైడర్‌కి మధ్యలో వుండటంచేత ఆ జీపు బలంగా మా స్కూటర్‌ను గుద్దుకుంది. స్కూటర్ వెనుక సీటులో కూర్చున్న నేను ఆ తాకిడికి గాలిలోకి ఎగిరి డివైడర్‌ని దాటి రోడ్డుపైన పడిపోయాను. శ్రీబాబు హెచ్చరికను పాటించి హెల్మెట్ ధరించడం వలన నా తలకు ఎటువంటి గాయం తగలలేదు. కానీ నా ఎడమ కాలు విరిగిపోయింది. ఆ తరువాత నన్ను మా సర్వీసు ఆసుపత్రికి తరలించారు. జనవరి వరకు నేను ఆసుపత్రిలో వున్నాను. ఈ మధ్యలో మా తల్లిదండ్రులైన వి.వి.ఆర్ ప్రసాదరావు గారు, సరోజనీదేవి గార్లకు నేను వేరొక కంప్యూటర్ కోర్సులో జేరటం వలన దసరా ఉత్సవాలకు రావడం కుదరదు అని చెప్పాను.

ఆసుపత్రిలో చేరిన నాకు డిసెంబర్ మొదటి వారం వరకూ నా ఎడమకాలు ఎముక అతుక్కొనలేదు. నేను అన్ని రోజులూ బెడ్ మీదే వుండిపోయాను. కానీ, నేను ప్రతిరోజూ శ్రీబాబుగారి సహస్రనామాలు, హనుమాన్ చాలీసా పారాయణ చేసేవాడిని. డిసెంబర్ నెలకి కూడా

నా ఎముక అతుక్కోని కారణంగా ఇహ ఆపరేషన్ తప్పదని డాక్టర్లు నిర్ణయించారు. నా ఎముక అతుక్కోవడానికి ఆపరేషన్ చేయలేదనీ, డాక్టర్లు, భగవంతుడు కూడా నన్ను పట్టించుకోవడం లేదనీ మంచం మీద పడి వున్నప్పుడు బాధపడ్డ సందర్భాలు ఎన్నో వున్నాయి. కానీ ఇదంతా శ్రీబాబు లీల అని అప్పుడు నేను అర్థం చేసుకోలేదు.

నేను ఉద్యోగరీత్యా కాన్పూర్‌లో వుండటం వలన నాకు ఎక్కువమందితో పరిచయం అవ్వలేదు. మా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్షన్ వుండటం వలన ఎవరూ నన్ను చూడటానికి వచ్చేవారు కాదు. వందల కి.మీ దూరంలో వున్న నన్ను పట్టించుకునేవారు లేరని నేను బాధ పడుతుంటే; శ్రీబాబూజీ మహరాజ్ పంపించిన వారిలాగ ఎవరో ఒకరు ఏదో ఒక రూపంలో వచ్చి నాకు సహాయం చేసేవారు. ఇది బాబూజీ వారిమీద నాకు నమ్మకాన్ని పదింతలు చేసింది. ఆ ఆసుపత్రిలో సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు జరిగిన ఆపరేషన్‌లలో ఏవీ కూడా నూటికి నూరు శాతం ఫలితం ఇవ్వలేదు. ఏదో ఒక రకం బాధతో పేషంట్లు బాధపడుతూ వుండేవారు.

కానీ, డిసెంబర్ నెలలో నా ఆపరేషన్‌కు శ్రీబాబుగారు నిర్ణయించిన సమయం అని నాకు అర్థం కాలేదు. అప్పుడు నాకు జరిగిన ఆపరేషన్ నూటికి నూరుపాళ్ళు ఫలితాన్ని ఇచ్చింది. శ్రీబాబు మా అమ్మగారికి 'నీ పిల్లలు ఎక్కడ వున్నా, వారికి నా రక్షణ వుంటుంది' అని వాగ్దానం చేశారట. అది నా విషయంలో నిజమైనది.

నా అనుభవ పూర్వకంగా తెలుసుకున్న విషయం ఏమిటంటే, శ్రీబాబుగారిని నమ్ముకున్న వారికి ఎక్కడ వున్నా సంపూర్ణ రక్షణ వుంటుంది. 'నమ్మిన వారికి బంగారు పిచ్చుక!' అన్న శ్రీబాబుగారి మాట నా విషయంలో పలుసార్లు ఋజువు అయింది. ఈ రోజు నేను ఆరోగ్యంగా నడుస్తూ, నా దినచర్య చేసుకోగలుగుతున్నాను అంటే అది శ్రీబాబుగారి కృప మాత్రమే. శ్రీగురుగీత చెప్పినట్లుగా **న గురోరధికం న గురోరధికం నగురోరధికం శివ శాసనతః శివ శాసనతః శివ శాసనతః** అనేది సత్యం, నిత్యం, శాశ్వతం అని తెలుసుకున్నాను.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**మే 2021**

6 గురు - శ్రీ గురుదశమి. ఉ॥ 10గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

10 సోమ - మాస శివరాత్రి

11 మంగళ - అమావాస్య

14 శుక్ర - అక్షయ తృతీయ. ఉదయం 11గం.శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన.

16 ఆది - శ్రీ శంకరజయంతి. శ్రీబాబు మూర్తి ప్రతిష్ఠావార్షికోత్సవం, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

26 బుధ - (వైశాఖ) శ్రీ గురుపూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

30 ఆది - వైశాఖ బహుళ పంచమి - శ్రీఉమా రామలింగేశ్వర స్వామివారి లీలా కళ్యాణం రాత్రి 7గం.లకు.

31 సోమ - ఆశ్రమ వ్యవస్థాపక దినోత్సవం - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

**జూన్ 2021**

4 శుక్ర - శ్రీ గురుదశమి, హనుమజ్జయంతి- సత్సంగం శ్రీసద్గురు పాదపూజ

8 మంగళ - మాస శివరాత్రి. జూన్ 8నుండి 12వరకు పావులూరి శాఖ వార్షిక సత్సంగ సమావేశములు. 12న శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి ఆరాధన. 13న మంగళహారతి.

10 గురు - అమావాస్య

19 శని - జ్యేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణప్రసాద మాతాజీవారి చతుర్దశ వార్షికారాధన, సత్సంగం.

24 గురు - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ

# శ్రీ బాబూజీతో అనుభవాలు

(గత సంచిక తరువాయి) - కోసూరు అరుణ కుమారి

మేము వేసవికాలము సెలవలలో ఆశ్రమానికి వచ్చాము. మాతాజీ గారు మమ్మల్ని ఆప్యాయంగా పలకరించి, “బాగున్నారా?” అన్నారు. మేము, “బాగున్నాము అమ్మా!” అన్నాము. వాడు (అబ్బాయి) ఏమి చేస్తున్నాడు అన్నారు? “బాగానే ఉన్నాడమ్మా! వాడికి కలలో బాబూజీ కనిపించారటమ్మా, తెల్లటి కారులో, తెల్లటి వస్త్రములతో కారులో నుంచి దిగుతుంటే అబ్బాయి చూసి పరిగెత్తుకుంటూ కారు దగ్గరకు వెళ్ళి, “బాబూజీ!” అన్నాడట. “ఊఁ ఏమి చేస్తున్నావు?” అన్నారట బాబూజీ. “మీరు జాబ్ ఇప్పిచ్చారు కదా! జాబ్ చేస్తున్నాను” అన్నాడట. ఏమైనా కావాలంటే అడుగు మా అమ్మడికి చెపుతా, మా అమ్మడికి లోకమంతా తెలుసు” అన్నారట. “అలాగే బాబూ!” అన్నాడట అని మాతాజీగారికి చెప్పాము. మాతాజీగారు, “మంచిది” అన్నారు. మా అబ్బాయి బాబూజీని చూసి ఉండలేదు.

నిజంగానే తరువాత మాతాజీగారు బెంగుళూరు వెళ్ళారు. అబ్బాయిని చూసి, అమ్మ ఎంతో ప్రేమతో, “వచ్చావా? ఉద్యోగం ఎలా వుంది?” అని అడిగారు. “బాగుంది అమ్మా!” అన్నాడు. అమ్మ, “ప్రసాదం తీసుకుని వెళ్ళమ”నిచెప్పి ఆశీర్వదించి పంపించారు. మా అబ్బాయికి ముందు బాబూజీ కలలో కనిపించి తరువాత నిజముగా మాతాజీగారే వచ్చి బెంగుళూరులో దర్శనం ఇచ్చారంటే, “బాబూజీయే మాతాజీ” అని మాకు నిదర్శనము అయింది.

మాతాజీ గారు నాగాయిలంక మండలము వస్తున్నారు అని తెలిసి నేను అక్కడికి వెళ్ళి మాతాజీ గారిని, “మా ఇంటికి కూడా రండి” అన్నాను. మరుసటి రోజు మాతాజీగారు మా ఇంటికి వచ్చారు. కోమలి గారు మాతాజీగారికి మాతో పాదపూజ చేయించారు. తరువాత మాతాజీ గారితో “అమ్మా! రేణుకాదేవి సంబరాలు చేసి మొక్కులు తీర్చుకొని మా పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాలి అనుకుంటున్నాము. మరి ఆయన లేరు కదా! మీరే మా రేణుకమ్మ తల్లి. మా పిల్లలను మీ పాదాలదగ్గర పెడుతున్నాను” అన్నాను. “అలాగే! వీళ్ళు నా బిడ్డలే!” అన్నారు మాతాజీ.

మాకు చాలా సంతోషమైంది. మాతాజీగారు మమ్మల్ని ఆశీర్వదించి ఆశ్రమానికి బయలుదేరారు.

అమ్మాయి ప్రత్యూషకి పెళ్ళి చెయ్యాలంటే భయము. "ఎలాంటి సంబంధాలు వస్తాయో?" అని. ఒకరోజు కలలో మాతాజీగారు బ్రహ్మం మాష్టారుగారు తెచ్చిన సంబంధానికి కుదుర్చుకొమ్మన్నారు. ఆ మాష్టారు ఆరు నెలలక్రితం ఆ సంబంధము గురించి చెప్పారు. అలా ఆ సంబంధము కుదిరి ప్రత్యూష పెళ్లి, చి॥ వెంకట గిరి ప్రసాద్‌తో జరిగింది.

6 నెలల తరువాత అబ్బాయి (వీర వెంకట రవికాంత్) కు రేష్మాతో మన కాళీవనాశ్రమములో బాబూజీ ఆశీస్సులతో, అమ్మ ఆశీస్సులతో వివాహం వైభవంగా జరిగింది. అల్లుడు వెంకట గిరి ప్రసాద్‌కి ఒక అమ్మాయి గీతా సహస్ర, ఒక అబ్బాయి ఋత్విక్ కృష్ణ. మా అబ్బాయికి ఒక కుమారుడు దుర్గా రమేష్ ప్రసాద్, ఒక కూతురు నిశ్చల శుభప్రద. ఎంతో దయతో మాకు శ్రీ మాతాజీ వారు ఋష్యశృంగ ఆశ్రమంలో వుండే అవకాశము కల్పించారు.. "ఓం ఆనంద నిలయాయనమః" అని బాబు అష్టోతరశతనామాలలో మొదటినామం. ఆనందనిలయుడు కదా మన బాబు!

ఆనందనిలయా కాళీప్రసాదా
గీతా చార్య రాధేశ్యామ వేణు గోపాలా ॥ఆనంద॥
ధర్మ రక్షకా, ధర్మ స్వరూపా కాళీ ప్రసాదా
కాళీ ప్రియా కాళీ తనయా కాళీ ప్రసాదా ॥ఆనంద॥
ఆనంద దాయినీ కాళిమాతా
ఐశ్వర్యకారిణీ మోక్షలక్ష్మీ కాళీమాతా ॥ఆనంద॥
కాళీ వనములో కాళీమాతవై
మంజుల భాషిణీ శ్రీ భవానీ ॥ఆనంద॥
(నామం) వేణు గోపాల రాధే గోపాలా
రాధే గోపాలా వేణు గోపాలా (స్వీయ రచన)

శ్రీబాబు సన్నిధిలో, "అమ్మ" చల్లని నీడలో మా జీవితాలు ఎంతో ఆనందంగా గడుస్తున్నాయి.

# శ్రీ గురు రవిదాస్

- మురళి

శ్రీ గురు రవిదాస్ మాఘ పౌర్ణమి రోజున వారణాసి పట్టణ సమీపంలోని గోవర్ధనపూర్ గ్రామంలో జన్మించారు (సంవత్సరం ఖచ్చితంగా తెలియదు. వారి జీవితకాలం సుమారుగా 1450 - 1520 మధ్యలో). తండ్రి సంతోఖ్ దాస్, తల్లి మాతా కల్వాదేవి. వీరు వృత్తి రీత్యా చర్మకారులు అయినందున అంటరానివారుగా పరిగణింపబడేవారు. రవిదాస్ తన కుటుంబ వృత్తిని స్వీకరించక చిన్నతనం నుంచీ ఆధ్యాత్మిక చింతనలో వుంటూ, ఎక్కువ సమయాన్ని గంగానదీ తీరంలో సాధు సంతులతో గడిపేవారు.

శ్రీ రవిదాస్ అనుచరులు శిక్కు మతాన్ని ఆచరించక పోయినా కూడా వారు ఆ మతాన్ని గౌరవించేవారు. శ్రీ రవిదాస్ రచించి, గానం చేసిన 41 పద్యాలు శిక్కుల ఆది గ్రంథం 'గురు గ్రంథ సాహెబ్'లో చేర్చబడ్డాయి. శిక్కుల మతాచారం ప్రకారం 'గురు గ్రంథ సాహెబ్' వారి చివరి గురువు. కానీ, శ్రీ రవిదాస్ అటువంటి ప్రకట చేయనందున వారి అనుచరులు శ్రీ రవిదాస్‌జీనే వారి పరమ గురువుగా విశ్వసించి, వారి బోధలను ఆచరిస్తున్నారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా సమానత్వాన్ని బోధించినవారిని వీరు గౌరవిస్తారు. శ్రీ రవిదాస్ అప్పటికి ప్రబలంగా వున్న భిన్న సంప్రదాయాలను, అంటరానితనాన్ని నిరసిస్తూ, సామాజిక ఐక్యత కొరకు ఆధ్యాత్మిక బోధలు చేశారు. సమానత్వం సాధించడానికి హిందూ బ్రాహ్మణులతోనూ, ముస్లీం సుల్తాన్ సికందర్‌లోడి తోనూ సామాజిక పోరాటం చేశారు.

శ్రీ రవిదాస్ భక్తకవి రామానందులవారి శిష్యరికం చేశారు. శ్రీ రవిదాస్ బోధలు, పాటలు హిందూ సాంప్రదాయం యొక్క నాథ్ యోగా తత్వాన్ని, సగుణ నిర్గుణారాధనను ప్రతిబింబిస్తూ వుండేవి. కాలక్రమేణా సగుణారాధనలోని గుణాలను త్యజించి నిర్గుణారాధనను బోధించారు. వారి బోధలు, కీర్తనలు భక్తులను ఆకట్టుకునేవి. వారు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ మరియు హిమాలయాలలో పర్యటించి భక్తులకు స్థానిక భాషలో బోధించేవారు. అనేకమంది భక్తులు వారిని అనుసరించి, వారి బోధలను మార్గదర్శకత్వాన్ని కాంక్షించారు. వారి

కీర్తనలు అత్యంత ప్రేమ, భక్తి ఇతి వృత్తాలతో నిండి వుండేవి. శ్రీ గురునానక్ మరియు ఇతర ఉత్తర భారదేశ మహాత్ములు బోధించే నిర్గుణ ఇతి వృత్తాల వలెనే వుండేవి. శ్రీ రవిదాస్ స్వచ్ఛమైన ప్రసంగం చేస్తూ తన దగ్గరకు వచ్చేవారి సందేహాలను నివృత్తి చేసేవారు. తన కులాన్ని గురించి చెప్పడానికి వెనుకాడేవారు కాదు. వారి బోధలు వేదాలలోను, ప్రాచీన గ్రంథాలలోను చెప్పబడిన విధంగా వుండేవి.

శ్రీ రవిదాస్‌వారి సందేశం - ఒక వ్యక్తి మంచిచెడుల మధ్య తేడాను గుర్తించవచ్చు. వేదాలు పురాణాలు వినవచ్చు, అంతటితో అతని సందేహాలు తీరిపోవు. బాహ్యంగా ఎంత పరిశుభ్రంగా వున్నా, అంతరంగం సర్వ దురాలోచనలతో వుంటే, అహంకారాన్ని నిర్మూలించుకోలేకపోతే ఏమీ సాధించలేరు, స్వచ్ఛంగా మారలేరు.

### చందాదారులకు విజ్ఞప్తి

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూాలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించు కొనవలసినదిగా విజ్ఞప్తి.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా  మే, జూన్ 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***మే2021 :*** AS 6900, 7069, 7272, 8038, 8056, 8057, 8138, 8139

***జూన్ 2021 :*** AS 7247, 7279, 7280, 8140, 8539

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

13-7-1965: ఆషాఢ పూర్ణిమ (గురు పూర్ణిమ) గుంటూరులో మాజేటి పున్నయ్య గారింట్లో జరిగింది.

14-7-1965: సత్సంగ సమావేశంలో శ్రీ బాబు గురువుగారి చేత 'మనీషా పంచకం' చదివించి అర్థం చెప్పించారు. తరువాత ఆమె **'ప్రజ్ఞానం బ్రహ్మ'** అనే మహా వాక్యానికి వివరణ చెప్పి, కృష్ణ తత్త్వమును గురించి మాట్లాడుతూ "ఉద్ధవుడు మహాజ్ఞాని అయినా, గోపికల భక్తిని గురించి తెలియక అజ్ఞానంలో పడినప్పుడు, తన్నివారణార్థం కృష్ణుడు అతనిని గోపికల వద్దకు పంపాడు" అని చెప్పారు. శ్రీ బాబు "అది సరికాదు. ఉద్ధవుడు పరమ భక్తాగ్రేసరుడు, కృష్ణుని ఒడిలో తల పెట్టుకుని అతను పడుకుని, తన రహస్యాలన్నీ దాచక కృష్ణునితో చెప్పాడు. కృష్ణుడు కూడా తన రహస్యమంతా అతనికి తెలిపాడు. అతనికి, కృష్ణునికి రూప భేదమే గాని, తత్త్వత: యిద్దరూ ఒకటే. అలా



కృష్ణునితో ఏకత్వం పొందిన ఉద్ధవుడు అజ్ఞానంలో పడటమేమిటి? వెలుగులో చీకటి ఉంటుందా? సత్సంగ మహద్భాగ్యాన్ని గోపికలతో కూడ మరింతగా పొందమని "నీవు నా సాన్నిహిత్యంలో పొందుతున్న బ్రహ్మానందాన్ని వాళ్ళు నా విరహంలో కూడ, ప్రకృతిలోని ప్రతి అణువులోనూ దర్శిస్తూ, పొందుతున్నారు. ఆ మహా భక్తులతో నీవు కూడా కలిసి బ్రహ్మానంద సముద్రంలో ఓలలాడండి. నేనూ మీ మధ్యలోనే వుంటాను " అని చెప్పి కృష్ణుడు ఉద్ధవుని గోపికల వద్దకు పంపాడు. ఉద్ధవుడు కూడ, ఆ సత్సంగమనే అమృతమును తనివి తీరా గ్రోలి, తిరిగి వచ్చి ఆ మాధుర్యము అంతులేనిదని కృష్ణునికి చెప్పాడు. ఉద్ధవుడే కాదు; యీ ఘట్టాన్ని భాగవతంలో రచించిన పోతన మహాత్మునిలో కూడ అజ్ఞానానికి చోటు లేదు"అన్నారు.

15-7-1965: శ్రీ బాబు భక్తుల ప్రోద్బలంతో మహాబలేశ్వరరావుగారితో

కారులో బయల్దేరి, ఆశ్రమం కోసం మంచి స్థలం వెతకటానికనే నెపంతో మద్రాసు రోడ్డులో కొంత దూరం వెళ్ళి, ఆ ప్రదేశాలను తమ దివ్య చరణరజంతో పవిత్రం చేసి వచ్చారు.

16-7-1965: మళ్ళీ యీ రోజు కూడా ఆశ్రమం కోసం స్థలాలు చూడటానికి అమరావతి, పేరేచర్ల మొదలైన ఊళ్ళకు వెళ్లి వచ్చారు.

19-7-1965: శ్రీ బాబు పాండుగారు, రాధాబాయి, ఉమాదేవి, భూషణమ్మగార్ల కుటుంబాలతో మూడు కార్లలో బయల్దేరి తిరుపతి, మైసూరు, శ్రీరంగం అన్నీ దర్శించి, 30-7-1965న తిరిగి వచ్చారు.

3/4-8-1965 :శ్రీ బాబు పాండుగారి కుటుంబంతో పండరీపురం వెళ్ళారు.

14-8-1965 : చీరాలలో కళ్యాణ మంటపానికి శ్రీ బాబు శంకు స్థాపన చేశారు.

19-8-1965: బెజవాడలో ఎలక్ట్రికల్ ఇంజనీరు కొండ శేషంరాజు గారింట్లో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీ బాబు పూజలు ప్రారంభమైనాయి. (ఆనాటి నుండి ఈ నాటి వరకు (2005సం॥) అవిచ్ఛిన్నంగా ఆ కుటుంబం వారు ఆ పూజలు నిర్వహించుకుంటున్నారు. ఎప్పటికీ అది వార్షికంగా జరుపుకుంటామని చెప్పారు.)

30-8-1965: పాండుగారింట్లో వినాయక చవితి పూజ జరిగింది.

13-9-1965: భాద్రపద పూర్ణిమ గుంటూరులో జరిగింది.

26-9-1965: గుండుగొలనులో భోగిరాజమ్మగారింట్లో దసరా పూజలు మొదలు. 30వ తేదీన శ్రీ బాబు తమ అనుగ్రహ భాషణము చేస్తూ మధ్యలో మంచినీరు త్రాగారు. 'మీ అందరి దాహం తీర్చటం కోసం యిలా చేశాను' అన్నారు.

10-10-1965: దసరా పూజలు పూర్తి అయిన మరునాడు ఉదయం రాఘవయ్యగారు శ్రీ బాబు స్నానానికి ఏర్పాటు చేశారు. శ్రీ బాబు స్నానం మొదలు పెట్టిన వారు అలాగే కూర్చుని నీళ్ళు యింకా యింకా తెమ్మన్నారు. గుండుగొలనులో జనమందరూ బిందెలు పుచ్చుకుని ఊళ్ళో ఉన్న బావుల్లోని నీళ్ళు, చెరువుల్లోని నీళ్ళు అన్నీ ఖాళీ చేసి తెచ్చి అభిషేకం చేసి శ్రీ బాబుకు హారతిచ్చుకున్నారు. సదాశివ స్వరూపులైన శ్రీ గురుదేవునికి సహస్ర ఘటాభిషేకం ఫలితంగా ఆ సాయంత్రం బ్రహ్మాండమైన వర్షం కురిసింది.

-సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

## బోధల బావా

"ఈ పిండి ఏ అతిథికి ఇవ్వగలను? ఏ అతిథీ తీసుకోడు. ఈ ఊరిలో భాగ్యవంతులు అనేకులు దీనజనులను మృష్టాన్న భోజనాదులచే తృప్తిపరుస్తున్నారు. వాటిని వదిలిపెట్టి ఈ పిండిని ఎవరు తీసుకుంటారు? ఒక అతిథికైనా ఆహారం పెట్టకుండా నేనెట్లా భుజిస్తాను? అని బాధపడుతుండగా దేవాదిదేవుడైన లక్ష్మీకాంతుడు ఒక బీద బ్రాహ్మణరూపంలో చినిగి పోయిన బట్టలు కట్టుకొని చలిలో గడగడ వణుకుతూ బోధల దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. "నువ్వు ప్రతి ఏకాదశికి ఈ ఊరు వచ్చి ద్వాదశినాడు అనేకులను తృప్తిపరచుచున్నావు. నేను ప్రతి



ద్వాదశినాడు వచ్చి నీ అతిధ్యాన్ని స్వీకరించాను. భాగ్యవంతులు చేసే సమారాధనలకు శరీరంలో జవసత్వాలు ఉన్న వాళ్ళు వెళ్తున్నారు. నేను బలహీనుడను. అక్కడికి వెళ్ళలేక నీ దగ్గరకు వచ్చాను. నాకు ఆకలిగా ఉన్నది ఏదైనా పెట్టు" అని అడిగాడు. బోధలబావా ఎంతో సంతోషించి నా ప్రాణేశ్వరుడైన శ్రీ పండరీనాధుడే ఈ రూపంలో వచ్చాడని భావించి "విప్రోత్తమా! నా వద్ద కొంత పిండివుంది. అందులో వేయటానికి ఉప్పుకూడా లేదు. ఇప్పటికి ఈ పిండిని స్వీకరించి నన్ను తృప్తి పరచు" అని అన్నాడు. ఆ బ్రాహ్మడు "నేను ఇక్కడే ఈ పిండితో రొట్టెలు చేసుకొని తింటాను. అడవిలోకి వెళ్ళి పిడకలు, పుల్లలు ఏరి తీసుకురా" అనగా బోధలబావా అడవినుండి పిడకలు, పుల్లలను తెచ్చి ఇచ్చాడు.

ఇంతలో ఆ బ్రాహ్మణుడు స్నానంచేసి వచ్చి నిప్పు రాజేసి పాకము చేయ యత్నించగా, రుక్మిణీదేవి ఒక వృద్ధ బ్రాహ్మణ సుమంగళిగా నాధుని దగ్గరకు వచ్చి "నన్ను వదలిపెట్టి వచ్చి ఇక్కడ భోజనం చేస్తున్నారా? నేను రొట్టెలు కాలుస్తాను" అంది. "పిండి కొంచెం. వీరిద్దరి ఆకలి ఎలా తీరుతుందో" అని బోధల విచారపడుతున్నాడు.

రుక్మిణీదేవి ఆ పిండిని స్పర్శించగానే అది అధికమైంది. రుక్మిణి రొట్టెలను కాల్చి మనం ముగ్గురం రొట్టెలను భుజించవచ్చు అన్నది. బోధల వారితో మీరు అతిథి రూపంలో వచ్చిన దేవతలు. మీరు భుజించాక, మీ భుక్త శేషాన్ని నాకు ఇవ్వండి అని ప్రార్థించాడు. వారు అంగీకరించి భోజనమునకు కూర్చుండగా పై నుండి దేవతలు ఈ అద్భుతాన్ని చూస్తున్నారు. వారు భుజించి భుక్త శేషాన్ని బోధలకు ఇచ్చి అదృశ్యులయ్యారు.

సాక్షాత్ పాండురంగడే రుక్మిణీ సమేతుడయి వచ్చి అనుగ్రహించాడని గ్రహించి, భగవత్సన్నిధికి వెళ్ళి చక్రపాణిని సేవించి "భక్తవత్సలా! నేడు, నేయి, చక్కెర లేక ఉత్త రొట్టెలను భుజించి సంతృప్తి చెందావా? ఈ క్షేత్రంలో అనేకులు షడ్రసోపేతంగా సమారాధనలు చేస్తుంటే కాదని వదలి ఈ దీనునిపై కృప చూపావా? అని విన్నవించుకొనగా పాండురంగడు దర్శనం ఇచ్చి "వైష్ణవాగ్రేసరా! అనేకులు సమారాధన చేస్తున్న చోట నేను వెళ్ళినా నాకు వారు అన్నం పెట్టరు. వారికి నాయందు భక్తిలేదు. డంభం కోసం చేసే సమారాధనలు అవి. రేపు నీకే తెలుస్తుంది" అన్నాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD